క్లుప్తంగా

రేపు ద్విచక్ర వాహనాల వేలం

పెద్దపంజాణి: పెద్దపంజాణి పోలీసు స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న రెండు ద్విచక్ర వాహనాలను బుధవారం ఉదయం 11.30 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్ఐ ధనుంజయ రెడ్డి తెలిపారు. చిత్తూరు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం పాటలు జరుగుతాయని వెల్లడించారు. ముందుగా నిర్ణయించిన రుసుం చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

పలమనేరులో..

పలమనేరు: కర్ణాటక మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న బైక్‌లను బుధవారం వేలం వేయనున్నట్టు ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి తెలిపారు. ముందుగా నిర్ణయించిన రుసుం చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. ఆసక్తి గల వారు బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్దకు రావాలని తెలిపారు.

ముగిసిన ఆడికృత్తిక ఉత్సవాలు

సదుం: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహించిన ఆడికృత్తిక ఉత్సవాలు సోమవారం ధ్వజావరోహణంతో ముగిశాయి. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు, పవలింపు సేవ చేపట్టారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వెంకటరమణా రెడ్డి, భాస్కర్ రెడ్డి, మల్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, మోహన్ రెడ్డి, రాజన్న, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ కుంభాభిషేకం

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీ భీర్జేపల్లెలో వున్న సీతారాముల ఆలయ విమాన గోపుర కలశ స్థాపన, ఉత్సవమూర్తులకు సంప్రోక్షణ కుంభాభిషేకాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం వేద పండితులు చిన్ని స్వామి ఆధ్వర్యంలో గణపతి ప్రార్థన, కలశార్చన, మహాగణపతి, పురస్వర, ఆదిత్యాదినవగ్రహ, మత్యుంజయ, రామనామ తారక హోమాలు, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. సీతారామలక్ష్మణ హనుమాన్ ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సృజన

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంటలో గల మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు సోమవారం ఇమ్యునైజేషన్ శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సృజన, సిబ్బంది పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహిస్తామని, 10 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు టీడీ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయనున్నట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వోలు మురళీబాబు, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంచిన మచ్చతెగులు

- టమాట రైతులను వేధిస్తున్న తెగుళ్ల బెడద
- ధరలున్నా దిగుబడి అంతంత మాత్రమే
- జాగ్రత్తలు పాటించాలంటున్న శాస్త్రవేత్తలు
- నియోజకవర్గంలో సుమారు 7 వేల ఎకరాల్లో పంట సాగు



చౌడేపల్లె మండలం ఎర్రపల్లె వద్ద సాగుచేసిన టమాటా పంట



టమాటా కాయలకు ఏర్పడిన మచ్చలు

టమాటా పంట సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పడం లేదు. గత రెండు నెలలుగా ధరల పతనంతో తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా వున్నాయి. కాయలకు మచ్చలు ఏర్పడడంతో నష్టాలు తప్పడం లేదు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం వుండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల వల్లే కాయలకు మచ్చలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం పంటల వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చౌడేపల్లె: పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి ఏటా వర్షాధార పంటలు సాగుచేసి నష్టాలు చవిచూస్తున్న రైతులు టమాటా పంట సాగుపై దృష్టిసారించారు. ఈ ఏడాది సుమారు 7 వేల ఎకరాల్లో టమాటా పంట సాగైంది. దిగుబడి బాగానే వచ్చింది. జనవరి నుంచి జూన్ వరకు టమాటా కాయలకు ధరలు పడిపోయాయి. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. నెలరోజులుగా ధరలు కొంత పెరిగాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల పంటను మచ్చ తెగులు, ఊజీ పురుగులు ఆశించాయి. దీంతో దిగుబడి ఆశించిన స్థాయిలో రావడం లేదు. పుంగనూరు, పలమనేరు, మదనపల్లె, పీలేరు, కలికిరి, కలకడ ప్రాంతాల్లో 15 కిలోల టమాటా బాక్సు ధర రూ.550 నుంచి రూ.700లు, 30 కేజీల బాక్సు రూ.1350 నుంచి రూ.1600 వరకు పలుకుతున్నాయి. కాయలకు మచ్చలు వస్తుండడంతో కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో రైతులు కాయలను పొలాల్లోనే పారబోస్తున్నారు. 15 కిలోలు నాణ్యతగా ఉంటే సుమారు 40 కిలోల వరకు కాయలు మచ్చ తెగులు బారిన పడినట్టు చెబుతున్నారు. శాస్త్రవేత్తలను సంప్రదిస్తే కొంత మేర జాగ్రత్తలు చెబుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం పంటల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

నివారణ ఇలా....

టమాటాలో ఆకులు, కాండం, కాయలపైన గోధుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడి క్రమేణా ఆకులు, మాడి ఎండిపోతాయి. దీనిని ఎర్లిబ్లైట్ రోగం అంటారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీని నివారణకు 3 గ్రాముల కాప్టాన్ లేదా మాంకోజెట్ లేదా క్లోరోథలోనిల్ 2 గ్రాములు, లేదా ప్రొపికొనజోల్ 1మి.లీలను లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో మూడు లేదా నాలుగుసార్లు పిచికారీ చేయాలని సూచిస్తున్నారు.

ధరలున్నా ఫలితం లేదు



నేను సుమారు 40 ఎకరాల్లో టమాటా పంట సాగుచేశాను. ప్రస్తుతం ఉన్న రేట్లతో పెట్టుబడి ఖర్చులు పోను కొంత మేరకు ఆదాయం వస్తుందని భావించాను. కాయలకు మచ్చ తెగులు ఆశించడంతో వారానికి రెండు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో నష్టం తప్పడం లేదు.

–యశ్వంత్ రాజు, ఎర్రపల్లె, చౌడేపల్లె

ఊజీగ, నల్ల మచ్చలతో తీవ్ర నష్టం



టమాటా పంటకు ఊజీగ కుట్టడం వల్ల కాయలు దెబ్బతింటున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం వుండడం లేదు. కాయలు కోసి గ్రేడింగ్ చేయాలన్నా చాలా ఇబ్బందిగా ఉంటోంది. ప్రతి కాయను పరిశీలించి మచ్చలేని వాటిని మాత్రమే బాక్సుల్లో నింపాల్సి వస్తోంది. మచ్చ కాయలను పడేయాల్సి వస్తోంది. **–మణిరాజు, ఎర్రపల్లె, చౌడేపల్లె**

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

గంగవరం: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. వర్షాలకు వీధులు, పరిసరాల్లో నీరు నిల్వ వుండకుండా చూడాలని పేర్కొన్నారు. నీటిలో దోమలు పెరిగి డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలుతాయని వెల్లడించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. రాత్రిళ్లు దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా తిరుపతి గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



తిరుపతి గంగమ్మ

పుంగనూరు: మండలంలోని బాగేపల్లె గ్రామంలో సోమవారం తిరుపతి గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున గణపతి ప్రార్థన, ప్రాణప్రతిష్ట, కళా హోమం, దుర్గా హోమం, పూర్ణాహుతి చేపట్టారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేసి, ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు.

కౌండిన్య నదిలోకి చెరువులోని చేపపిల్లలు

- మొరవను తెగ్గొట్టిన ఫలితం
- చేపల చెరువు దక్కించుకున్న వారికి తీరని నష్టం



పలమనేరు పెద్దచెరువు నుంచి వెళుతున్న నీరు

పలమనేరు: పట్టణంలోని పెద్ద చెరువు తూమును సోమవారం కొందరు జేసీబీతో తొలగించారు. దీంతో చెరువులోని చేపపిల్లలు కౌండిన్య నది పాలయ్యాయి. స్థానిక శ్రీనివాస మత్స్యకార సొసైటీ నిర్వాహకులు శ్రీధర్ ఈ చెరువులో రెండునెలల క్రితం మూడు లక్షల చేప పిల్లలను వదిలాడు. ఇవి మరో నాలుగు నెలలు పెరగాల్సి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి వరద నీరు పక్కనే ఉన్న రఘువీరారెడ్డి కాలనీలోని కొన్ని ఇళ్లల్లోకి చేరింది. దీంతో స్థానికులు అధికార పార్టీ నేత కు చెప్పారు. అతను మున్సిపల్, ఇరిగేషన్, ఫిషరీస్ అధికారులకు చెప్పకుండా జేసీబీతో చెరువు మొరవను తొలగించాడు. ఈ క్రమంలో చెరువులోని నీరంతా కిందనున్న బొమ్మిదొడ్డి చెరువులోకి చేరింది. పెద్దచెరువులోని చేపపిల్లలు మొరవ నీటిలో బొమ్మిదొడ్డి చెరువుకు చేరాయి. ఈ నీటి కారణంగా బొమ్మిదొడ్డి చెరువు సైతం మొరవెత్తింది. ఆ చెరువులో మరో వ్యక్తి మూడు లక్షల చేపపిల్లలను వదిలాడు. అక్కడి చెరువు మొరవ ద్వారా రెండు చెరువులకు చెందిన చేపపిల్లలు కౌండిన్య నదిలోకి వెళ్లిపోయా యి. తాము డబ్బు చెల్లించి చెరువులు పొందామని, చేపపిల్లలు వెళ్లిపోవడంతో లక్షలాది రూపాయలు నష్టపోయినట్టు బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

పుంగనూరు: పట్టణంలోని కుమ్మరవీధి సర్కిల్‌లో మంగళవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రెస్కో, మార్కెట్ యార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గం సభ్యులు

కుప్పం: నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ అందిస్తూ రెస్కోను, మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. రెస్కో చైర్మన్ ప్రతాప్, మార్కెట్ కమిటీ చైర్మన్ జీ.ఎం.మునిరాజులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెస్కోలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వారిని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, మున్సిపాలిటీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అభినందించారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించండి



పెద్దిరెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న మిద్దింటి కిషోర్‌బాబు, సుధాకర్‌రెడ్డి, నాగభూషణరెడ్డి తదితరులు

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందని, పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయనను సోమవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మిద్దింటి కిషోర్‌బాబు తిరుపతిలో కలిశారు. తనకు పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి యువతను నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. రాజకీయ కుట్రతో పలువురు చిన్నస్థాయి ఉద్యోగులను తొలగించి వారి పొట్టకొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను యువత ఆధ్వర్యంలో గ్రామాల్లోకి తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే యువతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, న్యాయవాది కడియాల నగేష్, పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, నాయకులు మల్లీశ్వరరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: అధికారులు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే ప్రజల్లో నమ్మకం కలుగుతుందని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత వుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలంలోని ప్రతి పంచాయితీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో వీధి లైట్లు వెలగడం లేదని, సచివాలయంలో పనిచేస్తున్న జేఎల్ఎంలు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్.కేశవులు, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు



సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు: పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు పట్టణంలో ఇటీవల పిల్లలు ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. తమ తనిఖీల్లో పట్టుబడితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పెద్దగా శబ్దం చేస్తూ హారన్లు వేయడం, సైలెన్సర్లు పెట్టుకోవడం చట్టవిరుద్ధమన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, వాహనాల రికార్డులు ఉంచుకోవాలని సూచించారు.

అర్హత లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు



ఆర్‌ఎంపీతో మా వైద్యశాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో గంగాదేవి

కుప్పం రూరల్: తగిన అర్హతలు లేకుండా క్లినిక్కులు ఏర్పాటుచేసుకుని వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో గంగాదేవి హెచ్చరించారు. ఆమె సోమవారం కుప్పం మండలం ఆవులనత్తంలో పర్యటించారు. అర్హత లేకుండా నిర్వహిస్తున్న ఆర్ఎంపీని హెచ్చరించారు. ఆమె మాట్లాడుతూ కుప్పం మండలం సరిహద్దు ప్రాంతాల్లో తమిళనాడుకు చెందిన చాలా మంది ఆర్ఎంపీలుగా చెలామణి అవుతున్నారని చెప్పారు. వారి వద్ద వైద్యం చేయించుకోరాదని స్థానికులకు సూచించారు. అలాంటి వారిపై సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని చెప్పారు. సెలూన్లు ఎక్కించడం, శస్త్ర చికిత్సలు చేయడం వంటివి చేయరాదని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుభాష్ పాల్గొన్నారు.

కూటమికి మంచి బుద్ధి ప్రసాదించు స్వామి!



కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వానికి మంచిబుద్ధి ప్రసాదించు స్వామీ శివయ్యా అని సోమవారం లద్దిగం గ్రామంలోని శివాలయంలో ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని కోరుతూ 101 కొబ్బరికాయలు కొట్టి, పెద్దిరెడ్డి కుటుంబం పేరిట అర్చనలు, అభిషేక పూజలు చేశారు. కుట్ర పూరితంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏదో రకంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని, ఇబ్బందులు పాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు, పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ న రసింహులు యాదవ్, ఎంపీటీసీ సభ్యులు జ్యోతమ్మ, చరణ్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచుల సంఘ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కేఆర్.గిరినాథ్‌రెడ్డి, నాయకులు నాగరాజ, కృష్ణమోహన్ రెడ్డి, షంషీర్, రవికుమార్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

గుడుపల్లె: ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని కుప్పం డీఎస్పీ పార్థసారథి హెచ్చరించారు. ఆయన సోమవారం పీఈఎస్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని బంగారు భవిష్యత్తును పొందాలన్నారు. స్నేహితులతో స్నేహంగా వుండాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడచుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే బాధ్యతగా ఉండాలన్నారు. అనంతరం ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్ఆర్ క్రిష్ణారావు, రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాభవం కోల్పోతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల!

ఘనకీర్తి కలిగిన పలమనేరు టీకేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాభవం తగ్గుతోంది. నాడు జిల్లాలోనే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు వుండి మంచి ఫలితాలతో కళకళలాడిన కళాశాల నేడు సమస్యలకు నెలవై వెలవెలబోతోంది. మరుగుదొడ్లు వున్నా ప్రారంభానికి నోచుకోకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఉన్నతాధికారులైనా ఈ కళాశాలల్లోని సమస్యలను తీర్చకుంటే రాబోవు రోజుల్లో కార్పొరేట్ కళాశాల దెబ్బకు మూతబడే సూచనలు కనిపిస్తున్నాయి.

- సమస్యలకు నెలవుగా మారిన వైనం
- మరుగుదొడ్లున్నా విద్యార్థులకు తప్పని తిప్పలు
- తగ్గిన విద్యార్థుల సంఖ్య
- బాలికల కళాశాలదీ ఇదే పరిస్థితి



పలమనేరు టీకేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల,



ప్రాగంణంలోని బాలికల జూనియర్ కళాశాల



ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు





వినియోగంలో లేని వాటర్ ఫిల్టర్ యూనిట్స్, కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు

పలమనేరు: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలోని పాత కళాశాలలో ఒక్కటిగా ఉంది. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని నిర్మించారు. పెద్ద మైదానం, కావాల్సినన్ని తరగతి గదులు వున్నాయి. సంప్రదాయ కోర్సులే కాకుండా సాంకేతిక కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయి. 14 గ్రూపులున్నాయి. ఆరుగురు ప్రభుత్వ అధ్యాపకులు, మరో 30 మంచి కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు. ఇదే ప్రాంగణంలో 2109లో బాలికల జూనియర్ కళాశాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. ఇక్కడ పది మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. గతంలో ఇక్కడి కళాశాలలో మొత్తం పిల్లల సంఖ్య 2,500లకు పైగా ఉంటూ జిల్లాలోనే టాప్‌లో ఉండేది. ఇప్పుడు ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లేకపోవడంతో పాలన గాడితప్పింది. కోఎడ్యుకేషన్‌లో విద్యార్థుల సంఖ్య 700, బాలికల కళాశాలలో 60కి పడిపోయింది.

గతంలో కళాశాల అభివృద్ధికి రూ.1.64 కోట్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ కళాశాల అభివృద్ధికి రూ.1.64 కోట్లు మంజూరు చేసింది. దీంతో మినరల్ వాటర్ ప్లాంట్, గ్రీన్ డిజిటల్ బోర్డులు, ఫర్నీచర్ తదితరాలకు రూ.కోటి వరకు ఖర్చుచేశారు. విద్యార్థుల మరుగుదొడ్ల కోసం రూ.31.40 లక్షలు, విద్యుత్ సౌకర్యం కోసం రూ.17.88 లక్షలు, కాంపౌండ్ వాల్ కోసం రూ.7.39 లక్షలు, మేజర్, మైనర్ రిపేర్ల కోసం రూ.7.39 లక్షలను ఖర్చు చేశారు. మరుగుదొడ్లు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. వాటర్ ప్లాంట్ పనిచేయలేదు.

అధ్వానంగా పరిసరాలు

కళాశాల ప్రాంగణం అపరిశుభ్రంగా మారింది. కాంట్రాక్టు అధ్యాపకులు విధులను సక్రమంగా నిర్వహించడం లేదు. కొందరు ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయారు. అందరూ జత కట్టి ప్రిన్సిపాల్‌కు సైతం భయపడే పరిస్థితి లేకుండా పోయింది. రెండు కళాశాలలకు ఒక్కరే ప్రిన్సిపాల్ వుండడంతో పాలన గాడి తప్పింది. ఇటీవల డీఐఈవో రఘుపతి ఈ కళాశాలను తనిఖీ చేసి ఇక్కడి పరిస్థితిని చూసి దిద్దుబాటు చర్యలకు దిగినట్టు తెలిసింది. ఏదేమైనా ఎందరినో ఉన్నత స్థానాలకు తీసుకెళ్లిన ఈ కళాశాల కళ్లముందే ప్రాభవాన్ని కోల్పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలపై కళాశాలపై స్థానిక ప్రిన్సిపాల్ కన్నయ్యను వివరణ కోరగా వెంటనే మరుగుదొడ్ల పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. ఇక్కడే తిష్టవేసిన కాంట్రాక్ట్ అధ్యాపకుల జాబితాను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. బాలికల జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించి కళాశాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలి



చిట్టిబాబు

కుప్పం రూరల్: పీఎస్ హెచ్‌ఎంల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని పీఎస్ హెచ్‌ఎంల ఫోరం రాష్ట్ర కమిటీ కార్యదర్శి చిట్టిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ స్పష్టమైన జాబ్‌చార్ట్ విడుదల చేయాలని కోరారు. నూతన పరీక్షా విధానంలో మార్పులు, పెండింగ్ జీతాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఉన్న 1 నుంచి 5 తరగతులను ఒక యూనిట్‌గా చేసి ప్రత్యేక డ్రస్ కోడ్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో ఈ నెల 21 నుంచి 30 వరకు నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు.